ప్రభుత్వం మారితే పథకాలు ఆపేస్తారు

- ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు
- కత్తిమండలో ఆసరా సాయం పంపిణీ

మలికిపురం: రాష్ట్రంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం మారితే.. ఇప్పుడున్న సంక్షేమ పథకాలన్నీ టీడీపీ కూటమి కచ్చితంగా ఆపేస్తుందని రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు అన్నారు. గురువారం మలికిపురంలోని కత్తిమండలోని ఎమ్మెల్యే రాపాక క్యాంపు కార్యాలయం ఆవరణలో మండలంలోని 13,047 మంది లబ్ధిదారులకు ప్రభుత్వం మంజూరు చేసిన వైఎస్సార్ ఆసరా రూ.12,33,59,260ను మహిళ ఖాతాల్లో జమ చేసే కార్యక్రమాన్ని నిర్వహిస్తూ, నమూనా చెక్కును అందజేశారు. వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు అడబాల వీర బ్రహ్మాజీరావు సభకు అధ్యక్షత వహించారు. ఎమ్మెల్యే రాపాక మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న సంక్షేమ పథకాలు విపక్షాలకు ఇష్టం లేదన్నారు. వాటిని అమలు చేస్తామని చెప్పే ధైర్యం కూడా వారికి లేదన్నారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ప్రజా సంక్షేమమే జరగలేదని విమర్శించారు. అప్పటికే ఉన్న లబ్ధిదారు మరణిస్తేనే.. కొత్త పింఛను ఇచ్చిన ఘనత చంద్రబాబుదని అన్నారు. నేడు అర్హులందరికీ పింఛన్లు ఇస్తున్న ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. మహిళలంతా ఆలోచించి వచ్చే ఎన్నికల్లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే మద్దతు ఇవ్వాలని కోరారు. జెడ్పీటీసీ బల్ల ప్రసన్నకుమారి మాట్లాడుతూ గత టీడీపీ హయాంలో పథకాలకు, ప్రస్తుత ప్రభుత్వం అందిస్తున్న పథకాలను బేరీజు వేసుకుని ముందుకు సాగాలని కోరారు. ఎంపీపీ వీరా మల్లిబాబు, పాటి శివకుమార్, సూరిశెట్టి బాబి, రొక్కాల వెంకట్, కంచర్ల శేఖర్, సుంకర బాబ్జి, మహిళా సమాఖ్య అధ్యక్షురాలు గన్నపురెడ్డి సుమలత, మంగాదేవి, రాయుడు విమల, సర్పంచ్‌లు గెడ్డం రాజ్యలక్ష్మి, సుందర తాతాజీ, పెచ్చెట్టి నరసింహస్వామి, నల్లి విజయకుమారి, ఎంపీటీసీలు అంజలీదేవి, రేకపల్లి శ్రీదేవి, చిట్టాల శ్రీను, ఎంపీడీఓ ముత్యం వీరాస్వామినాయుడు, కొల్లాబత్తుల అశోక్, శివకుమార్, ఏఎంసీ వైస్ చైర్మన్ సుంకర బాబ్జి తదితరులు పాల్గొన్నారు.


కత్తిమండ సభకు భారీగా హాజరైన మహిళలు


కత్తిమండలో మహిళలకు ఆసరా నమూనా చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు

జగనన్నను మళ్లీ గెలిపిద్దాం

పోస్టర్ ఆవిష్కరణలో ఎమ్మెల్యే జగ్గిరెడ్డి


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే జగ్గిరెడ్డి

ఆత్రేయపురం: వైఎస్సార్ సీపీ అభివృద్ధికి కృషి చేస్తూ, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ గెలిపించుకునేందుకు పార్టీ శ్రేణులు శ్రమించాలని కొత్తపేట ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి కోరారు. కొత్తపేట నియోజకవర్గంలో ఎన్నికలకు వైఎస్సార్ సీపీ సిద్ధం అనే పోస్టర్‌ను నాయకులు, కార్యకర్తలు, అభిమానుల సమక్షంలో గురువారం ఆయన ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ ప్రత్యర్థులు మూకుమ్మడిగా ఎన్నికల్లో వైఎస్సార్ సీపీతో తలపడినా, చివరకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదే గెలుపని చెప్పారు. నియోజకవర్గంలో పార్టీ ముందడుగు వేస్తుందంటే అందుకు నాయకులు, కార్యకర్తలే కారణమని పేర్కొన్నారు. నియోజకవర్గ పార్టీలో తప్పు తన వైపు ఉన్నా, సభాముఖంగా క్షమాపణ కోరుతున్నానని చెప్పారు. ప్రతిఒక్కరూ సైనికుడిలా పని చేయాలని కోరారు. అలా జరగకపోతే పార్టీని నమ్ముకున్నవారు, సంక్షేమాన్ని పొందుతున్న కోట్లాది మంది తీవ్ర నష్టాలు చవిచూడాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతిపక్షాలను ఢీకొనే ఈ సంగ్రామంలో పేదల పక్షాన నిలబడిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అండగా నిలవాలని, మరోసారి కొత్తపేటలో వైఎస్సార్ సీపీ జెండా రెపరెపలాడాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పార్టీ నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్యులంతా నావెంటే : జగ్గిరెడ్డి

ఆత్రేయపురం: ఏ ప్రాంతం అభివృద్ధి చెందాలన్నా ఆర్యవైశ్యులు కీలకమని ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. వాడపల్లి వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో వేంకటేశ్వర వాసవీ నిత్యాన్నదాన ట్రస్టు సత్రం ఏర్పాటు చేసిన సందర్భంగా, అందుకు సహకరించిన ఎమ్మెల్యే జగ్గిరెడ్డిని ఆర్యవైశ్యులు సన్మానించారు. వాడపల్లిలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆర్యవైశ్య ప్రముఖుడు శ్రీఘాకొళపు శివరామసుబ్రహ్మణ్యం పాల్గొన్నారు. ఎమ్మెల్యే జగ్గిరెడ్డి మాట్లాడుతూ వాడపల్లిలో ఈ ట్రస్టుకు రాజమార్గాన్ని ఏర్పాటు చేయాలని ఆర్యవైశ్య ప్రముఖులు కోరగా, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకు వెళ్లి అనుమతులు తెచ్చామన్నారు. పార్టీలకతీతంగా ఆర్యవైశ్యులు ఎల్లప్పుడూ తనను ఆశీర్వదిస్తూనే ఉన్నారన్నారు. సుమారు రూ.20 కోట్లతో ఆర్యవైశ్య కల్యాణ మండపానికి ఎలాంటి ఫీజులు లేకుండా, ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేశామన్నారు. భవిష్యత్తులో ఆర్యవైశ్యులకు అన్నివిధాలా సహకరిస్తానని హామీ ఇచ్చారు.


ఎమ్మెల్యే జగ్గిరెడ్డిని సన్మానిస్తున్న ఆర్యవైశ్య ప్రముఖులు

చిత్తడి నేలల సంరక్షణ అందరి బాధ్యత

సఖినేటిపల్లి: పర్యావరణ పరిరక్షణ కోసం చిత్తడి నేలల సంరక్షణ ప్రతిఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలని డీఈఓ ఎం.కమలకుమారి అన్నారు. గురువారం అంతర్వేదికరలోని సెయింట్ మేరీస్ ఇంగ్లిష్ మీడియం హైస్కూల్‌లో ఏపీ నేషనల్ గ్రీన్ కోర్, పాఠశాల విద్యాశాఖ, అటవీ శాఖ సంయుక్తాధ్వర్యంలో సేవ్ వెట్‌ల్యాండ్ క్యాంపెయిన్(ఎస్‌డబ్ల్యూసీ)ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా చిత్తడి నేలల పరిరక్షణకు సంబంధించిన పోస్టర్‌ను డీఈఓ ఆవిష్కరించారు. మొక్కలు పెంచడం జీవితంలో భాగం చేసుకోవాలన్నారు. అనంతరం చిత్తడి నేలల సంరక్షణపై విద్యార్థులతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం ప్రత్యేక సమావేశంలో సీఎంఓ బీవీవీ సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ చిత్తడి నేలలకు తీవ్ర నష్టం చేకూర్చడం వల్లే వాతావరణంలో విపరీత మార్పులు చోటుచేసుకుంటున్నాయని వివరించారు. జిల్లా ఉమ్మడి పరీక్షల నిర్వహణాధికారి బి.హనుమంతరావు మాట్లాడుతూ నీటి మడుగులను కాపాడుకోవడం ద్వారా పర్యావరణాన్ని రక్షించినట్టు అవుతుందన్నారు. జిల్లా సైన్స్ అధికారి జి.సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ ప్లాస్టిక్ వ్యర్థాలను నదుల్లో వేయడం వల్ల జల వనరులు కలుషితం అవుతున్నాయన్నారు. ఏపీ ఎన్‌జీసీ స్టేట్ మానిటరింగ్ అధికారిణి జి.ప్రభావతి మాట్లాడుతూ భావితరాలకు మంచి వాతావరణంతో కూడిన భవిష్యత్తును అందించే బాధ్యత నేటి విద్యార్థులపైనే ఉందన్నారు. వివిధ ప్రైవేటు, ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు, బోధనా సిబ్బంది పాల్గొన్నారు.


చిత్తడి నేలల పరిరక్షణకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న డీఈఓ

రామస్వామి సేవలు ఎప్పటికీ మరువలేనివి


పేదలకు దుప్పట్లు అందిస్తున్న ఈఓ, చైర్మన్

మామిడికుదురు: బాల బాలాజీ స్వామి ఆలయ నిర్మాణం ద్వారా మొల్లేటి రామస్వామి అప్పనపల్లి గ్రామానికి అందించిన సేవలు ఎప్పటికీ మరువలేనివని ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ చిట్టూరి రామకృష్ణ, ఈఓ గ్రంధి మాధవి కొనియాడారు. ఆలయ వ్యవస్థాపకుడు మొల్లేటి రామస్వామి వర్ధంతి సందర్భంగా గురువారం ఆలయ ప్రాంగణంలోని రామస్వామి, ఆదిలక్ష్మి విగ్రహాలకు వీరితో పాటు ఆలయ ఉద్యోగులు, ట్రస్టీలు, స్థానికులు నివాళులర్పించారు. ఆలయం తరఫున పేదలకు దుప్పట్లు, పండ్లు పంచారు. ఈ సందర్భంగా చైర్మన్ రామకృష్ణ, ఈఓ మాధవి మాట్లాడుతూ రాష్ట్రంలో మొట్టమొదటిసారిగా 1977లో ఉచిత అన్నదానానికి నాంది పలికిన మహోన్నత వ్యక్తిగా రామస్వామి గుర్తింపు పొందారని కీర్తించారు. అప్పనపల్లిలో బాలబాలాజీ స్వామి ఆలయం నిర్మించిన రామస్వామి ఎంతో మంది స్థానికులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించారని సర్పంచ్ గెడ్డం మంగాలక్ష్మి, ఎంపీటీసీ బొంతు నీలిమ, మాజీ చైర్మన్ పిచ్చిక చిన్న కొనియాడారు. పీఏసీఎస్ చైర్మన్ గెడ్డం కృష్ణమూర్తి, ట్రస్టు బోర్డు సభ్యులు చిట్టాల సత్తిబాబు, సూరిబాబు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

మాదిగలకు సీట్లు కేటాయించాలి

పి.గన్నవరం: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో జిల్లాలోని ఎస్సీ రిజర్వుడు అసెంబ్లీ స్థానాల్లో స్థానిక మాదిగలకు అవకాశం కల్పించాలని గురువారం ఇక్కడ జరిగిన మాదిగ నాయకుల సమావేశం రాజకీయ పార్టీలకు విజ్ఞప్తి చేసింది. ఎంఆర్‌పీఎస్ సీనియర్ నాయకుడు తవిటికి రాజు అధ్యక్షతన ఈ సమావేశం జరిగింది.

పీఏసీఎస్ జనరిక్ స్టోర్ ప్రారంభం

రాజోలు: రాజోలు ప్రాథమిక సహకార పరపతి సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జనరిక్ మెడికల్ స్టోర్‌ను ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు గురువారం ప్రారంభించారు. పీఏసీఎస్ చైర్మన్ కూనపరెడ్డి రాంబాబు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే రాపాక మాట్లాడుతూ ఇప్పటికే రైతులకు సొసైటీల ద్వారా విత్తనాలు, ఎరువులు సబ్సిడీపై అందించడమే కాకుండా, ఆదాయ మార్గాలు కల్పించేలా పెట్రోలు బంక్‌ల నిర్వహణ చేపడుతున్నారన్నారు. జిల్లా సహకార అధికారి ఎ.రాధాకృష్ణారావు, సబ్ డివిజనల్ సహకార అధికారి ఎం.ఏ సునాయనా, సర్పంచ్‌లు రేవు జ్యోతి, నక్కా రామారావు, ఎంపీటీసీలు కొపనాతి పుష్పలత, చెల్లింగి లక్ష్మీఈశ్వరి, సొసైటీ డైరెక్టర్లు కట్టా సత్యానారాయణ, గెడ్డం కాశీరావు, బి.సావరం, కడలి, కేశనపల్లి సొసైటీ చైర్మన్లు కంచి వెంకటరమణ, తోట సురేష్, యెనుముల నారాయణ, నాయకులు దార్ల పెదబాబు, మట్టా ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగ అభివృద్ధికి పెద్ద పీట

నియోజకవర్గ ఇన్‌చార్జి విప్పర్తి

పి.గన్నవరం: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి విద్యారంగ అభివృద్ధికి పెద్దపీట వేస్తున్నారని నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జి, జెడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు అన్నారు. మానేపల్లి గ్రామంలోని బాలుర, బాలికల జెడ్పీ హైస్కూళ్లలో ఎనిమిదో తరగతి చదువుతున్న 90 మంది విద్యార్థులకు బైజూస్ ట్యాబ్‌లను గురువారం ఆయన పంపిణీ చేశారు. హెచ్‌ఎం ఎం.సూర్యనారాయణ సభకు అధ్యక్షత వహించారు. విప్పర్తి మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలలను సీఎం జగన్ అభివృద్ధి చేశారని వివరించారు. ఎంఈఓ కోన హెలీనా, ఎంఈఓ–2 చింతా వీరభద్రం, పార్టీ రాష్ట్ర కార్యదర్శి పితాని నర్సింహరావు, కార్పొరేషన్ డైరెక్టర్ మద్దుల వరలక్ష్మి, పార్టీ నాయకులు యన్నాబత్తుల భూషణం, కోళ్ల గణపతి, పెంటపాటి బాల రత్నకుమారి, వడ్లమూడి రామారావు, సామ్యూల్ రాజు, అంకాని పరిశుద్ధుడు, కొపనాతి రోజావాణి, కొంబత్తుల రాధాకృష్ణ, హెచ్‌ఎం జి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేస్తున్న విప్పర్తి

ప్రజాస్వామ్యంలో ఓటే వజ్రాయుధం

ఘనంగా జాతీయ ఓటర్ల దినోత్సవం

మామిడికుదురు: మన ప్రజాస్వామ్యంలో ఓటు వజ్రాయుధం లాంటిదని, దాని విలువను ప్రతిఒక్కరూ తెలుసుకోవాలని తహసీల్దార్ రియాజ్ హుస్సేన్ అన్నారు. మామిడికుదురు జెడ్పీ హైస్కూల్‌లో గురువారం జాతీయ ఓటర్ల దినోత్సవం జరిగింది. విద్యార్థులకు ముగ్గుల పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందించారు. విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. పాశర్లపూడి పంచాయతీ వద్ద సీనియర్ ఓటర్లను సర్పంచ్ కొనుకు ప్రేమజ్యోతి, ఎంపీటీసీ అంకాని వీరాంజనేయులు, వైఎస్సార్ సీపీ గ్రామ శాఖ అధ్యక్షుడు చిక్కం బుజ్జిబాబు, మాజీ సర్పంచ్ కొనుకు నాగరాజు సన్మానించారు. ఎంఈఓలు లక్ష్మీనారాయణ, వెంకన్నబాబు, సర్పంచ్ గౌస్‌మొహిద్దీన్, ఎంపీటీసీ నయినాల సీతామహలక్ష్మి, ఇన్‌చార్జి హెచ్‌ఎం దొంగ సత్యనారాయణ పాల్గొన్నారు.

ఓటు విలువను గుర్తించాలి

మలికిపురం: జాతీయ ఓటరు దినోత్సవాన్ని స్థానిక ఎంవీఎన్ జేఎస్ అండ్ ఆర్వీఆర్ ప్రభుత్వ ఎయిడెడ్ డిగ్రీ కాలేజీలో నిర్వహించారు. ప్రిన్సిపాల్ టి.సతీష్ అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథి అమలాపురం డీఎల్‌డీఓ పి.విజయథామస్ మాట్లాడుతూ ప్రజాస్వామ్య దేశంలో ఓటు హక్కు పెద్ద ఆయుధమని, ప్రతి ఓటరు ఓటు ప్రాధాన్యాన్ని తెలుసుకుని, మంచి నాయకుడిని ఎన్నుకోవాలన్నారు. ఇద్దరు సీనియర్ ఓటర్లను సత్కరించారు. అనంతరం ఓటరు ప్రతిజ్ఞ చేసి, ర్యాలీ నిర్వహించారు. తహసీల్దారు జీవీఎల్ నరసింహారావు, ఎంపీడీఓ ముత్యాల నాయుడు, సర్పంచ్ రాజ్యలక్ష్మి, సఖినేటిపల్లి ఎంపీపీ మల్లిబాబు, శివ తదితరులు పాల్గొన్నారు.

ఓటు హక్కును వినియోగించుకోవాలి

రావులపాలెం: ఓటరైన ప్రతిఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని వక్తలు పేర్కొన్నారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని ఎన్ఎస్ఎస్ అధికారి ఎస్ అరుణ్‌కుమార్ ఆధ్వర్యంలో కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ యు. రమేష్‌బాబు ఆధ్వర్యంలో నిర్వహించారు. ముఖ్యఅతిథి తహసీల్దారు మృత్యుంజయరావు మాట్లాడుతూ కుల, మత, వర్గ, ప్రాంతీయ భేదాలు చూడకుండా, ప్రలోభాలకు లొంగకుండా, సమర్థ నాయకుడిని పవిత్రమైన ఓటు హక్కు ద్వారా ఎన్నుకోవాలని కోరారు. విద్యార్థులతో ఓటరు ప్రతిజ్ఞ చేయించి, ర్యాలీ నిర్వహించారు. ఈతకోట లిథియా ఫార్మసీ కళాశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు ర్యాలీ నిర్వహించారు.

విద్యార్థులకు పోటీలు

అంబాజీపేట: జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా స్థానిక జెడ్పీ హైస్కూల్‌లో రెవెన్యూ అధికారుల ఆధ్వర్యంలో విద్యార్థులకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందించారు. సీనియర్ ఓటర్లను సన్మానించారు. ఇన్‌చార్జి తహసీల్దార్ నాగపద్మాలక్ష్మి, వైస్ ఎంపీపీ లక్ష్మీభార్గవి, ఉప సర్పంచ్ నాయుడు పాల్గొన్నారు.

ఓటర్లకు సన్మానం

కొత్తపేట: జాతీయ ఓటరు దినోత్సవాన్ని స్థానిక వీకేవీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఆర్డీఓ ముక్కంటి మాట్లాడుతూ ప్రతిఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. సీనియర్ సిటిజన్లు, మహిళా, దివ్యాంగ ఓటర్లను సన్మానించారు. విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ప్రిన్సిపాల్ కె.పెద్దిరాజు పాల్గొన్నారు.


కొత్తపేటలో సీనియర్ ఓటర్లను సన్మానిస్తున్న అధికారులు


పి.గన్నవరంలో మానవహారంలో పాల్గొన్న తహసీల్దార్ ఠాగూర్

దేశ సమగ్రతను కాపాడాలి

ఆలమూరు: ఓటు హక్కును సద్వినియోగం చేసుకుని, దేశ సమగ్రత, సార్వభౌమత్వాన్ని కాపాడాలని ఎంపీపీ తోరాటి లక్ష్మణరావు, జెడ్పీటీసీ తోరాటి సీతామహాలక్ష్మి, ఏఎంసీ చైర్మన్ యనమదల నాగేశ్వరరావు అన్నారు. పలు గ్రామాల్లో తహసీల్దార్ ఐపీ శెట్టి ఆధ్వర్యంలో దినోత్సవాలు జరిగాయి. ర్యాలీలు, మానవహారం నిర్వహించారు. పంచాయతీ కార్యాలయాల వద్ద సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు ఓటరు దినోత్సవం నిర్వహించారు. ఎంపీడీఓ కె.జాన్‌లింకన్, ఈఓపీఆర్‌డీ రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

పి.గన్నవరం: ఓటు వజ్రాయుధం లాంటిదని, ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ జి.రవీంద్రనాథ్ ఠాగూర్ అన్నారు. జాతీయ ఓటరు దినోత్సవాన్ని స్థానిక గ్రేస్ విద్యాసంస్థల ప్రాంగణంలో నిర్వహించారు. విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ఠాగూర్ ఆధ్వర్యంలో విద్యార్థుల ర్యాలీ జరిగింది. పోలీస్ స్టేషన్ సెంటర్లో మానవహారం నిర్వహించారు. డిప్యూటీ తహసీల్దార్ బి.గోపాలకృష్ణ, ఎంఈఓ కోన హెలీనా, ఎస్సై హరికోటిశాస్త్రి, వీఆర్వో తోట శ్రీను, స్వామి, గ్రేస్ కళాశాల కరస్పాండెంట్ నల్లి శ్రీచరణ్, ప్రిన్సిపాల్ నాయుడు పాల్గొన్నారు.

క్లుప్తంగా

జేసీఎస్ ఇన్‌చార్జిగా వెంకట్రామ్


వెంకట్రామ్‌ను అభినందిస్తున్న దృశ్యం

మలికిపురం: ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు తనయుడు రాపాక వెంకట్రామ్ రాజోలు నియోజకవర్గ జగనన్న బూత్ కన్వీనర్లు, గృహ సారథుల ఇన్‌చార్జిగా నియమితులయ్యారు. ఈ మేరకు మలికిపురంలో గురువారం జరిగిన సభలో ఎమ్మెల్యే రాపాక వెల్లడించారు. ఈ సందర్భంగా వెంకట్రామ్‌ను ఎమ్మెల్యే రాపాకతో పాటు జెడ్పీటీసీ బల్ల ప్రసన్నకుమారి, పార్టీ మండల అధ్యక్షుడు అడబాల బ్రహ్మాజీ, ఎంపీపీ వీరా మల్లిబాబు తదితరులు పూలమాలలతో అభినందించారు. తనతో పాటే తనయుడిని కూడా ఆశీర్వదించాలని ఎమ్మెల్యే రాపాక కోరారు. పార్టీ నిర్ణయాల మేరకు నడుచుకుంటానని ఈ సందర్భంగా వెంకట్రామ్ అన్నారు.

చిచ్చర పిడుగులు


ఆకట్టుకున్న విద్యార్థుల పిరమిడ్ ప్రదర్శన

మామిడికుదురు: రిపబ్లిక్ డేను పురస్కరించుకుని మామిడికుదురులో గురువారం విద్యార్థులు పిరమిడ్ ఆకారంలో చేసిన విన్యాసాలు ఆకట్టుకున్నాయి. జాతీయ పతాకాన్ని చేతపట్టుకుని, పిరమిడ్ ఆకారంలో ఏర్పడి, భరతమాతకు సెల్యూట్ చేసిన ప్రదర్శన ఔరా అనిపించింది. దీన్ని ప్రదర్శించిన విద్యార్థులను హెచ్‌ఎం డీవీవీ సత్యనారాయణ, యక్కలదేవర నాగన్నబాబు, ఇతర ఉపాధ్యాయులు అభినందించారు.

పెన్సిల్ ముల్లుపై జాతీయ జెండా


పెన్సిల్ ముల్లుపై చెక్కిన జాతీయ జెండాలు

కొత్తపేట: గణతంత్ర దినోత్సవం సందర్భంగా గ్రామంలోని చప్పిడి వారిపాలెం ఆర్ఎస్‌వీఎం జెడ్పీ హైస్కూల్‌కు చెందిన విద్యార్థులు తరెట్ల గౌతం, వాసంశెట్టి వర్షిత్తు రెండు వేర్వేరు పెన్సిల్ ముల్లుపై జాతీయ జెండాలు చెక్కి, రంగులు దిద్దారు. గురువారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో విద్యార్థుల ప్రతిభను హెచ్‌ఎం కె.అరుణశ్రీ, ఉపాధ్యాయులు అభినందించారు.

క్రీడల్లోనూ రాణించాలి

పి.గన్నవరం: విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లోను రాణించాలని జెడ్పీటీసీ గూడపాటి రమాదేవి అన్నారు. ఇటీవల రాష్ట్ర,జిల్లా స్థాయి ఆటల పోటీల్లో నరేంద్రపురం గురుకుల పాఠశాలకు చెందిన పది మంది విద్యార్థులు ప్రతిభ చూపారు. వీరికి మమత స్వచ్ఛంద సేవా సమితి అధ్యక్షుడు కోరుకొండ జాన్ ఆధ్వర్యంలో గురువారం బహుమతులు అందజేశారు.

వీఆర్‌ఓకు ఉత్తమ బీఎల్‌ఓ అవార్డు


గవర్నర్ నుంచి అవార్డు అందుకుంటున్న దుర్గాప్రసాద్

మామిడికుదురు: జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా నుంచి ఉత్తమ బీఎల్‌ఓగా మామిడికుదురుకు చెందిన ఇంటి హరి దుర్గాప్రసాద్ గురువారం అవార్డు అందుకున్నారు. విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో జరిగిన కార్యక్రమంలో గవర్నర్ అబ్దుల్ నజీర్ చేతుల మీదుగా ఆయన ప్రశంసాపత్రం అందుకున్నారు. దుర్గాప్రసాద్ ప్రస్తుతం అల్లవరం మండలం తాడికోన వీఆర్‌ఓగా పనిచేస్తున్నారు.

మృతుల కుటుంబాలకు సాయం

మలికిపురం/అయినవిల్లి: టీడీపీ అధినేత చంద్రబాబు భార్య నారా భువనేశ్వరి గురువారం కోనసీమ జిల్లాలో పర్యటించారు. చంద్రబాబు అరెస్టుతో మనస్తాపానికి గురై గుండెపోటుతో మృతి చెందిన కుటుంబాలను పరామర్శించి, రూ.3లక్షల చొప్పున చెక్కులు అందించారు. మలికిపురం మండలం విశ్వేశ్వరాయపురంలో చెల్లుబోయిన నరసింహారావు, అయినవిల్లి మండలం ఎస్.మూలపాలెంలో మోరంపూడి మీరాసాహెబ్ కుటుంబానికి సాయం అందించారు.

ఆనందోత్సాహాలతో హజరత్ అలీ జయంతి


నగరంలో జరిగిన జయంత్యుత్సవంలో పాల్గొన్న ముస్లింలు

మామిడికుదురు: ముస్లింల ఆరాధ్యులైన హజరత్ అలీ జయంతిని గురువారం ఆనందోత్సాహాలతో నిర్వహించారు. మామిడికుదురు ఖ్రమే బన్నీ హాసిం పంజాలోను, నగరంలోని పెద పంజీషాలోను జయంతిని పురస్కరించుకుని మిలాద్ జరిగింది. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు ఆయా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పంజాలను విద్యుద్దీపాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. పలువురు ఉర్దూ కవులు తమ కవిత్వాల ద్వారా హజరత్ అలీ గొప్పతనాన్ని వివరించారు.

PUBLIC NOTICE

SRI PITHANI VENKATA SATYANARAYANA ...

M. RAVI RAM, B.Sc., B.L., Advocate





